# కథ

# రాజకీయం

**టి. రామాంజనేయులు**

**“ప్రాణ రక్షణ కల్పించలేని ప్రభుత్వం దిగిపోవాలి. మంత్రిగారు వెంటనే రాజీనామా చేయాలి. మంత్రిగారు డౌన్, డౌన్” అరిచే వాళ్లు కొందరైతే వినోదాన్ని తిలకించే వాళ్లు మరికొంతమంది. మొత్తం మీద ట్రాఫిక్ బంద్.**

''ఏం జరిగిందేమిటి మావా! బస్సు యాడనో మద్దెలో ఆగిపోనట్లుందే. ఎవరో కేకలేత్తుండారు. డైవరన్న యారినైనా గుద్దేసినాడేంటి. ఇందాకట్నుంచి సెవిగోసిన మేకలా నేనరుత్తావుంటే కిమ్మనకుండా కూకున్నావేంటి మావా'' చేయి పట్టేలాగింది మంగి. ఏదో లోకంలో విహరిస్తున్న బాలయ్య ఉలిక్కిపడి ఈ లోకంలోకొచ్చాడు.

అసలే మండల కేంద్రం. పైగా ప్రధాన రహదారి. చూస్తుండగానే వాహనాల క్యూ పెరిగిపోయింది. ఇంతలో తప్పెట్ల మోతలు. జనాల కేకలు, ఈలలు. ఏదో వూరేగింపు అటువైపే వస్తున్నట్లుంది. బస్సులు, లారీలు, ఆటోలు ఇలా అన్ని వాహనాల నుండి కిందికి దిగిన ప్రయాణికులు వుత్సాహంగా అటువైపు చూస్తున్నారు. దిగలేక లోపలున్నవారంతా కుతూహలంతో తొంగి చూస్తున్నారు.

'వేసేద్దాం ఒక దండ ఎందుకైనా పనికొస్తుంది' అనుకునే కాకారాయుళ్లు వేశారో, అభిమానులెవరైనా ప్రేమకొద్ది వేశారో, లేక తానే డబ్బిచ్చి కొని, వేరెవరి చేతనైనా వేయించుకున్నాడో కాని ఒక మోస్తరు పూలదండ మెడలో వేసుకొని, పిచ్చి అభిమానులు ఎద్దుల బండిని తామే లాగుతుంటే, దానిపై నుంచే అందరికీ నక్కలా వంగి వంగి నమస్కారాలు చేస్తూ అక్కడికి చేరుకున్నాడు. ఏ పార్టీ నాయకుడో ఎవరికి తెలియని ఓ మోస్తరు రాజకీయ నాయకుడు.

''సోదరీ సోదరులారా! ఈ అన్యాయాన్ని, దారుణాన్ని, రాక్షసకృత్యాన్ని మీరు చూస్తున్నారు కదా. సామాన్యుల ప్రాణాలను కాపాడలేని ఈ ప్రభుత్వం ఇక వుండడానికి వీల్లేదు. ఇప్పుడు చెప్పండి. ఇలాంటి పనులు చేయాలనేనా మీరంతా ఓటేసింది!''

''లేదు లేదు'' ఎక్కడో మూల నుంచి కేకలు.

''ఇలాంటివి జరుగుతాయని వూహించే నాకు ఓటు వేయండయ్యా అని కాళ్లావేళ్లా పడ్డాను. నెత్తీనోరూ కొట్టుకొని ప్రాధేయపడ్డాను. గెలిచాక మీ ముఖాలు ఎలాగూ చూసే అవకాశముండదని తెలిసే ముందుగానే మీకు డబ్బు పంచాను. మందు పోయించాను. ఉత్తమాటలే కదా అని కోరినవన్నీ తీరుస్తానని వాగ్దానాలు చేశాను. అయితే మీరేం చేశారు. నాకు డిపాజిట్ కూడా దక్కకుండా చేశారు. అయినా ఎందరి కొంపలో ముంచే నాకు అదనంగా మిగిలిన దొంగడబ్బే కదా మీకు పంచింది. అందుకే ఓడినా నేనేమీ బాధపడడం లేదు. ఇప్పుడు నేను చెప్పేదేమంటే, ఎన్నికల్లో మీరు నన్ను గెలిపించివుంటే, ఈనాడిలా జరిగివుండేదా? అని అడుగుతున్నాను. మరీ తప్పనిసరి పరిస్థితిలో అయితే ఏదో కాలో, చేయో పోయేలా యాక్సిడెంట్ జరిగేది కాని పూర్తిగా ప్రాణం పోయేలా మాత్రం జరిగివుండేది కాదని, ఇక్కడ బల్లలేదు అయినా బల్లగుద్ది మరీ గట్టిగా చెప్తున్నాను. ఇంతసేపు నేను చెప్పిందంతా నిజమేనా? కాదా?''

''అవును, అవును'' మరోసారి చప్పట్లు, కేకలు.

'ఇంతకూ వాళ్లు అవునన్నది నేను ఇంతవరకు చెప్పిందంతా నిజమని ఒప్పుకున్నందుకా, కాదని చెప్పేటందుకా' ఏదీ అర్థంకాక జుట్టు పీక్కోబోయాడు. నెత్తిమీద వెంట్రుకలు లేవని తెలుసుకుని నున్నని గుండును చేత్తో తడుముకుంటూ చేయి కిందికి దించాడు.

''కాబట్టి సోదరీ సోదరులారా! మీకోసం మీకు న్యాయం జరగడం కోసం నా ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధంగా వున్నాను. అయినా పరిస్థితి అంతవరకు రాదు కాబట్టి నేను ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నాను. మీరంతా నా చుట్టూ వుంటారు. కాబట్టి నాకేమీ భయం లేదు. అందుకే మీ మధ్యలో ఇక్కడే కూర్చుని నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నాను'' మళ్ళీ చప్పట్లు.

''హలో సార్! మినిస్టరుగారేనా! నేను ఫలానా సర్కిల్ సి.ఐ.ని మాట్లాడుతున్నాను. ఇక్కడ ఒక బస్సుడ్రైవరు యాక్సిడెంట్ చేశాడట సార్. ఎవరో గొప్ప పేరున్నవాడే చనిపోయినట్లున్నాడు సార్. ఎవరూ సరిగా చెప్పడం లేదు. పోలీసులను అక్కడికి రానీయడం లేదు. పరిస్థితి ఉద్రేకంగా వుంది. మీరేం చేయాలో చెబితే...'' నసిగాడు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ సి.ఐ.గారు.

''ఏ అల్లర్లు జరుగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయండి'' వెంటనే మంత్రిగారి ఆదేశం.

''హలో అన్నా! యాదికుండానా..ఇక్కడో గోరం జరిగిపోనాది. అన్నాయంగా అందరూ సూస్తుండగానే అదే సర్కారు బస్సు డ్రైవరు ఓ నిండు ప్రాణాన్ని బలిగొనిండు. ఇక్కడంతా గడబిడగా వుంది. మనకింతకన్నా చాన్సు దొరకదు నీవు మాత్రం ఈ విషయాన్ని అసెంబ్లీలో ఇరగదీయాల. నీవేం మాట్లాడుతావో టి.వి.లో చూస్తాగా'' ఒక చోటా నాయకుడు మరో బడా నాయకునికి ఫోను.

''ఒక నిండు ప్రాణం గాల్లో కలిసిపోవడానికి కారణం బస్సు డ్రైవరు నిర్లక్ష్యమే. అందుకు కారణం ప్రభుత్వం వారి అసమర్థత కాబట్టి అధ్యక్షా ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాల్సిందిగా గవర్నరుకు సిఫార్సు చేయాలని మేము గట్టిగా కోరుతున్నాం'' అసెంబ్లీలో ప్రతిపక్షం వాది డిమాండు. దానికి వంతపాడిన మిత్రపక్షాలు. నిరసనలు, వాకౌట్‌లు. ఫలితం అసెంబ్లీ సమావేశాలు నిరవధికంగా వాయిదా.

అత్యవసరంగా మంత్రివర్గ సమావేశం జరిగింది. ''అసెంబ్లీ సమావేశాలు వాయిదా వేసినంత మాత్రాన సమస్య తీరదు. అక్కడ ఉద్యమం తీవ్రరూపం దాలుస్తోంది. వెంటనే ఒక కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేయిద్దాం. లేకుంటే ఉద్యమాన్ని ఆపడం కష్టం'' సమావేశంలో మంత్రివర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. వెంటనే ఒక రిటైర్డు ఐ.ఏ.ఎస్, ఇద్దరు ఐ.పి.ఎస్‌లతో విచారణ కమిటి వేస్తున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. ఉద్యమం ఆగిపోయింది. నిరాహార దీక్షల విరమణ జరిగింది.

''ఫలానా తేదీన మీ మండలానికి విచారణ కమిటీ వారు వస్తున్నారు. ఎవరైనా సరే వారు చూసింది, విన్నది నిర్భయంగా కమిటీ ముందు చెప్పవచ్చు. అటువంటివారికి ప్రభుత్వం పూర్తి భద్రత కల్పిస్తుంది'' కరపత్రాలు పంచారు మండలంలో ముఖ్యమైన స్థలాలలో గోడలపై అంటించారు.

అనుకున్న తేది రానే వచ్చింది. ప్రజల సమక్షంలోనే విచారణ ప్రారంభమయింది. మొట్టమొదటగా నిరాహార దీక్షకూ పూనుకున్న నాయకుడే కమిటీ ముందు కొచ్చాడు.

''సార్! ఆరోజేం జరిగిందంటే, 'అన్యాయంగా ప్రాణం తీశాడు, జనం ఆ డ్రైవరుకు దేహశుద్ధి చేశారు. బస్టాండు దగ్గర గందరగోళంగా వుంది'



అంటూ మా వీధిలో వాళ్ళు మాట్లాడుకోవడం విన్నానండి. ఎంతైనా ప్రజలకోసం జీవించే నాయకుడ్ని కదండి. ఇక ఆగలేక పోయా. వెంటనే బయలుదేరా. నా మనసులోని బాధను అందరి ముందు వెళ్లకక్కాను. అప్పుడప్పుడు అలా ప్రజల ముందుకొస్తుంటేనే గదా నాలాంటివాడ్ని ప్రజలు గుర్తుంచుకునేది. అంత ఘోరం జరిగితే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుంది. ఇదేమి పరిపాలనండి'' ఇంకా ఏమో చెప్పబోయారు పేరులేని ఆ నాయకుడు.

''మీ ఉపన్యాసం కాస్త ఆపుతారా. ఇంతకూ ఆరోజు చనిపోయిన ఆ మహానుభావుడెవరో చెప్పండి'' ఒక ఐ.ఎ.ఎస్. అధికారి ప్రశ్నించాడు.

''నేను చూస్తే కదండి చెప్పడానికి, ఎవరో మాట్లాడింది విన్నాను. ఆవేశంతో అధికార పక్షాన్ని దుమ్మ దులిపాను. అంతే కాని నాకేం తెలుసునని'' మెల్లగా జారుకున్నాడు ఆ వినాయకుడు.

''ప్రాణం తీస్తే వూరుకుంటామా సారూ! అంతా డ్రైవరును చితకబాదుతూ వుంటే నేను కూడా రెండు దెబ్బలేశానంతే. ఆ సమయంలో అక్కడెవరి శవము లేదాయె. ఇంతవరకు నాకర్థం కాలేదు. అక్కడ సచ్చిందెవరబ్బా'' తానేదో ఘనకార్యం చేసినట్లుగా ఫోజు పెట్టాడు వుడుకు రక్తంతో వూగిసలాడుతున్న ఒక యువకుడు.

ఇలా ఎవరికి తోచింది వారు చెప్తున్నారే కాని చనిపోయింది ఎవరో, ఉద్యమం ఎలా మొదలయిందో ఎవరూ చెప్పడం లేదు. నిరాశపడ్డారు కమిటీ సభ్యులు.

''ఇంతసేపట్నుంచి వూరకే నసపెడుతున్నారు, కాని అక్కడ జరిగింది ఎవరూ చెప్పడం లేదు. నన్నడిగితే చెప్పాలనుకున్నా కాని నన్నెవరూ అడగరే'' తాగిన మైకంలో వూగుతూ పైకి లేచాడు ఒక తాగుబోతు.

''నేనొక ఓటేల్‌లో పనిజేత్తున్నానయ్యా అప్డు నేను బస్టాండులోనే నిలబడున్నాను గదా. అనుకోకుండా చిటికెలో అడ్డమొత్తే ఎవరైనా ఏం జేత్తారు పాపం. అప్పటికే డైవరు బేకు తొక్కాడు. అయినా లాభం లేకపోయింది. కొట్టేసి నాడు'' కొంచెం ఆగాడు అతడు. ఆత్రంగా చూడసాగారంతా.

''ఒకేసారి రెండు అడ్డమొచ్చాయి. ఒకటి తప్పించుకుంది. కాని రెండోది టైరు కింద పడి నుజ్జు అయింది. జనం రెచ్చిపోయారు. డైవరును చావ బాదారు. ఇంతలో ఏమైందో డొను, బందు అంటు గుంపు తయారయింది. అంతే జరిగింది. నా మతిమండా అసలు సంగతి చెప్పలేదుకదా. ఆరోజు సచ్చింది మా ఓటేలు ఆయనదే కుక్కపిల్ల సారూ. నేనే దాన్ని దూరంగా పారవేసొచ్చా గదా! ఆ మాత్రం దానికే ఇంత గొడవ జేత్తున్నారు. ఏం మడుసులో'' చావుకబురు చల్లగా చెప్పాడు ఆ తాగుబోతు. నోరెళ్లబెట్టారు కమిటీ సభ్యులు.

అప్పుడు నోళ్లు విప్పారు మరికొందరు ''అదే జరిగింది సారూ'' అని.

'ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని స్వార్థపరులు ఎంతగా నాటకాలాడుతున్నారో. రాజకీయమంటే 'రాక్షసంగా జనులకు కీడు చేసే యంత్రాంగం' అని విన్నప్పుడు నవ్వుకున్నాం గానీ, ఇప్పుడు కళ్లారా చూస్తున్నాం, రాజకీయమంటే ఎంత నీచంగా ఉంటుందోనని. ఏం జరిగిందో తెలుసుకోకుండా ఎంత రాద్ధాంతం జరిగింది. మున్ముందు ఈ దేశం ఏమవుతుందో హే భగవాన్ నీవే కాపాడాలి అనుకుంటూ వెనుదిరిగారు విచారణ కమిటి సభ్యులు.